ప్రజాశక్తి
శనివారం 29 జూన్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

రైల్వే జోన్ ఇంకెంత దూరం..!

విశాఖ రైల్వే స్టేషన్ (ఫైల్ ఫొటో)

- జనరల్ మేనేజర్ పోస్టును కేంద్రం కేటాయించేనా ?
- కూటమి ప్రభుత్వం ఒత్తిడి తెచ్చేనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అంశం మళ్లీ తెరమీదకు వస్తోంది. రాష్ట్రంలో భారీ మెజారిటీతో 'కూటమి' పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బిజెపి అధికారం చేపట్టిన విషయం తెలిసిందే. ఉమ్మడి విశాఖ జిల్లాలో కూటమి అభ్యర్థులే విజయఢంకా మోగించారు. వారంతా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైల్వే జోన్ ఆవశ్యకతను ప్రస్తావించారు. ఇప్పుడు గెలిచారు కాబట్టి.. వారు కథలు చెప్పి తప్పించుకోడానికి అవకాశం లేదని పలువురు భావిస్తున్నారు. వాస్తవానికి విశాఖకు రైల్వే జోన్ అర్హత ఏనాడో ఉంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, పోర్టు, షిప్‌యార్డు సహా పలు కంపెనీలు ఇక్కడే ఉన్నాయి. రైల్వే జోన్ పనులు ప్రారంభిస్తున్నామన్న కనీస సంకేతం కింద జోన్ జనరల్ మేనేజర్ పోస్టు అయినా తక్షణం కేటాయించాల్సి ఉంది. అయితే ఆ దిశగా నూతన ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఒక్క అడుగూ పడలేదు.

రెండు స్థలాలు సిద్ధంగా ఉన్నప్పటికీ..

విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం చూపడం లేదంటూ గతంలో బిజెపి కేంద్ర మంత్రులు ఆరోపించడం తెలిసిందే. విశాఖ రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం వెనక భాగంలో 30 ఎకరాల వరకూ స్థలం సిద్ధంగా ఉంది. గతంలో బిఆర్‌టిఎస్ కోసం రైల్వే నుంచి 26 ఎకరాలను జివిఎంసి తీసుకోగా దానికి ప్రత్యామ్నాయంగా ముడసర్లోవ వద్ద సర్వే నెంబరు 57 నుంచి 59 పి, 61 పి, 62 పి, 63, 64, 65ల్లో 52 ఎకరాలను కేటాయిస్తూ రైల్వేకు ఉత్తర్వులు కూడా ఇచ్చింది. దీంట్లో ఇప్పటికీ 27 ఎకరాల వరకూ క్లియర్ భూమి సిద్ధంగా ఉంది. కావాలనే కేంద్రంలోని బిజెపి సర్కారు జాప్యం చేస్తూ జోన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టడం లేదు. 2016-17లో రైల్వే డివిజన్ కేంద్రాన్ని ఇక్కడ నుంచి ఎత్తేసింది. దక్షిణ కోస్తా రైల్వే జోన్ విశాఖకు ఇస్తున్నట్లు ప్రకటించి ఉన్న వాల్తేరు రైల్వేను వెనక్కి లాగేసింది. విశాఖకు 200 కిలోమీటర్లలోపు విజయవాడ డివిజన్ ఉండగా వాల్తేరు రైల్వే వేరేగా ఎందుకు ? అనేది కేంద్రం వాదన. విజయవాడకు 40 కిలోమీటర్ల మిగతా 2లో..

విశాఖ సిపిగా శంకబ్రతా బాగ్చీ

సిఐడికి రవిశంకర్ అయ్యర్ బదిలీ

శంకబ్రతా బాగ్చీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్‌గా రాష్ట్ర డిజిపి కార్యాలయంలో అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి - లా అండ్ ఆర్డర్)గా పనిచేస్తున్న 1996 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన శంకబ్రతా బాగ్చీని బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 సెప్టెంబర్ నుంచి విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన 1994 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ ఎ.రవిశంకర్ అయ్యర్‌ను సిఐడి అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ చేసినట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రవిశంకర్ విశాఖ సిపిగా పనిచేసిన కాలంలో మిలాన్-2024, సార్వత్రిక ఎన్నికలు వంటి ప్రతిష్టాత్మక కార్యక్ర మాలను ముందస్తు ప్రణాళికలతో విజయ వంతంగా నిర్వహించారు. డయల్ యువర్ సిపి, దిశ, దివ్యాంగ సురక్ష వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టారు.

నేడు జెడ్‌పి

స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా పరిషత్ ఒకటి నుంచి ఏడు వరకుగల స్థాయీ సంఘాల సమావేశాలు శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం.పోలినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒకటి నుంచి ఏడో స్థాయీ సంఘాల సమావేశాలు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు 2, 5 స్థాయీ సంఘాల సమావేశాలు, 11 గంటలకు 4, 3 స్థాయీ సంఘ సమావేశాలు, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7 స్థాయీ సంఘ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి సురభి నాటకాలు

వార్త 2లో..

పెంచిన జియో రీఛార్జ్ ఛార్జీలను తగ్గించాలి

వార్త 5లో..

సెజ్ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

వార్త 5లో..

బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారుడు

ఎపిఎల్ సీజన్-3

క్రికెటర్ల సందడి

ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో ముమ్మర సాధన వార్త 4లో..

క్లాక్‌టవర్ దాదాపు పూర్తి

ప్రారంభమైతే జగదాంబ జంక్షన్‌కు ప్రత్యేక శోభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగదాంబ జంక్షన్‌లో ఆధునిక పద్ధతిలో నిర్మిస్తున్న క్లాక్ టవర్ (గంట స్తంభం) నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. క్లాక్ టవర్ గ్రౌండ్ భాగంలో గ్రీనరీ వర్క్ ప్రస్తుతం జరుగుతోంది. సుమారు 60 అడుగుల ఎత్తులో నిర్మించిన క్లాక్ టవర్‌కు ఆధునిక పద్ధతిలో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో ఎంతో అందంగా కనిపించడమే కాకుండా, సమయ వేళలు గడియారంలో కనిపించే విధంగా నాలుగు వైపులా వాటిని ఏర్పాటు చేశారు. జగదాంబ జంక్షన్‌కు నూతన శోభ కలిగించే విధంగా దీని నిర్మాణం జరిగింది. సుమారు రూ.2.5 కోట్లతో క్లాక్ టవర్‌తో పాటు లేపాక్షి జంక్షన్‌లో సెంట్రల్ ఐలాండ్ నిర్మాణం పనులు చేసేందుకు జివిఎంసి నిధులు కేటాయించారు. అందుకే క్లాక్ టవర్ నుంచి లేపాక్షి జంక్షన్‌లో నిర్మించే సర్కిల్ వరకు సెంట్రల్ లైటింగ్‌తో పాటు అందమైన మొక్కలను ఏర్పాటు చేశారు. లేపాక్షి జంక్షన్ (సర్కిల్) పనులు పూర్తయిన వెంటనే ఒకేసారి ఈ మొత్తం అభివృద్ధి పనులను ప్రారంభించడానికి జివిఎంసి అధికారులు ప్రయత్నిస్తున్నారు. జివిఎంసి పరిధిలో అన్ని ప్రాంతాలలో రూ.30 కోట్లతో జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఈ పనులను చేపట్టారు. జివిఎంసి కమిషనర్ సిఎం.సాయి కాంత్ వర్మ తరచూ జగదాంబ జంక్షన్‌కు రావడం, క్లాక్ టవర్ వగైరా పనులను పర్యవేక్షించడం జరుగుతోంది. ఎప్పటికప్పుడు, ఇంజినీర్లకు, కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేస్తూ పనులు శరవేగంగా జరిగేలా ఆయన శ్రద్ధ వహిస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి..

రైల్వే జోన్ ఇంకెంత దూరం..!

దూరమే గుంటూరు.. అలాంటప్పుడు డివిజన్ అదెందుకు అనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదు. అడ్డగోలుగా వాల్తేరు రైల్వేకు ఉద్వాసన పలికి జోన్ కూడా ఇవ్వడం లేదు. కొత్తగా రైల్వే జోన్ ఇచ్చిన ఎక్కడా కూడా దేశంలో డివిజన్‌ను ఎత్తేయలేదు.

రైల్వే ఆస్తులకు విశాఖ కేంద్రం

విశాఖ కేంద్రంగా కంచరపాలెంలో రైల్వే కోచింగ్ కాంప్లెక్స్ ఉంది. ఎలక్ట్రికల్ లోకో షెడ్, డీజిల్ లోకో షెడ్ ఇక్కడే ఉన్నాయి. వడ్లపూడిలో రైల్ వ్యాగన్ వర్క్‌షాప్ ఉంది. వందల సంఖ్యలో ఆఫీసర్లు, ఉద్యోగులు ఆయా సెంటర్లలో పనిచేస్తున్నారు. డివిజన్‌ను తీసేసినా ఆ ఆస్తులు ఇక్కడ ఉన్నందున వారంతా ఇక్కడే పనిచేయాలి. రైల్వే డివిజనల్ ఆసుపత్రి కూడా విశాఖలోనే ఉంది. డివిజన్ లేకుండా చేయాలనే కుట్ర తప్ప ఎంత మాత్రమూ కేంద్ర నిర్ణయం సముచితం కాదు. విశాఖలో రెండు పోర్టులున్నాయి. స్టీల్‌ప్లాంట్, ఇతర పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతుల విషయంలో సమన్వయం చేసుకోడానికి అడిషనల్ డీఆర్ఎం స్థాయి అధికారి ఇక్కడ ఉండాల్సిన అవసరం ఉంది. డివిజన్ లేకుండా చేసి వాల్తేరు స్థాయిని తగ్గించే బిజెపి కుట్రలపై కూటమి పార్టీల నేతలు ప్రశ్నించకపోతే విశాఖకు తీవ్ర అన్యాయం చేసిన వారవుతారన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

తనిఖీలు చేపడుతున్న అధికారులు

స్కూలు బస్సులు, ఆటోలపై కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నిబంధనలు ఉల్లంఘించిన రెండు స్కూల్ బస్సులు, మూడు ఆటోలపై కేసులు నమోదు చేశామని, మూడు ఆటోలను సీజ్ చేశామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజారత్నం మీడియాకు తెలిపారు. శుక్రవారం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కొమ్మాది తదితర ప్రాంతాలలో స్కూలు, కాలేజీ బస్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ నెల 13 నుండి ఇప్పటి వరకు 36 బస్సులపై కేసులు నమోదు చేసి ఒక బస్సును సీజు చేశామని, అలాగే 24 ఆటోలపై కేసులు నమోదు చేసి నాలుగు ఆటోలను సీజు చేశామని వెల్లడించారు.

ఎంజిసిహెచ్‌తో హెచ్‌సిజి ఎంఒయు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ కేన్సర్ కేర్ నెట్ వర్క్‌లలో ఒకటైన హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (హెచ్‌సిజి)కు, వైజాగ్‌లోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు మధ్య భాగస్వామ్య ఒప్పందం కుదిరినట్టు హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ బిఎస్.అజయ్‌కుమార్, రాజ్ గోర్, డాక్టర్ మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ చీఫ్ సర్జికల్ అంకాలజిస్ట్ మురళీకృష్ణ వోన్నా తెలిపారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ 1986లో స్థాపించబడిన మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అత్యధిక మార్కెట్ వాటాతో వైజాగ్‌లో సమగ్ర కేన్సర్ కేర్ అందించే ప్రముఖ ప్రొవైడర్‌గా అవతరించిందన్నారు. వైజాగ్ రీజియన్‌లో ఆధిపత్య వాటాతో.ఆసుపత్రిలో 196 ఆపరేషనల్ పడకలు ఉన్నాయని, 2 ఎల్ఐఎన్ఎసి యంత్రాలు, 1 పిఇటి సిటి స్కానర్, ఒక రోబోటిక్స్ సర్జరీ సిస్టమ్, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్‌తో సహా అధునాతన వైద్య మౌలిక సదుపాయాలను కలిగి ఉన్నాయన్నారు. దాని వైద్య బృందంలో 12 మంది సర్జికల్, 6 రేడియేషన్, 4 మెడికల్ ఆంకాలజిస్టులతో సహా 31 మంది వైద్యులు ఉన్నారన్నారు. ఆంకాలజీ కేర్‌లో అగ్రగామిగా ఉన్న హెచ్‌సిజి మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి సహకారంతో మరింత మెరుగైన సేవలను కేన్సర్ రోగులకు అందించనుందన్నారు. దీంతో విశాఖపట్నంతో పాటు ఉత్తరాంధ్ర ప్రాంత వాసులందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు.

తెలుగు కామెంటరీతో ఎపిఎల్ ప్రత్యక్ష ప్రసారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌కు అధికారిక డిజిటల్ భాగస్వామి అయిన ఫ్యాన్‌కోడ్ ఇంగ్లీష్ కామెంటరీతో పాటు అన్ని మ్యాచ్‌లను తెలుగు కామెంటరీతో ప్రసారం చేయనుందని ఆ సంస్థ ప్రతినిధి కుమార్ వెల్లడించారు. ఈ మేరకు ఎపిఎల్ వివరాలను ఆయన శుక్రవారం వెల్లడించారు. ఈ లీగ్‌కు తెలుగు వ్యాఖ్యాతలుగా ఐపిఎల్ మాజీ స్టార్లు, ఆంధ్రా ఆటగాళ్లు టి.సుమన్, కల్యాణ్ కృష్ణ వ్యవహరించనున్నారన్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ సీజన్ జూన్ 30న ప్రారంభమవుతుందని, జులై 13 వరకు కొనసాగుతుందని తెలిపారు. రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్, కెవిఆర్ ఉత్తరాంధ్ర లయన్స్, మార్నిన్ గోదావరి టైటాన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ జట్లు పాల్గొంటాయని వెల్లడించారు.

అంతర్జాతీయ స్థాయిలో హిందీకి గుర్తింపు వచ్చేలా కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అంతర్జాతీయ స్థాయిలో హిందీ భాషకు గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నామని విశ్వ హిందీ పరిషత్ ఛైర్మన్, పద్మ విభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం ఎయు హిందీ విభాగంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

భవన నిర్మాణ కార్మికులకు

వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు కొనసాగించాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షురాలు పి.అనసూయ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తానని చెప్పి, ఇసుక ధరలు భారీగా పెంచి ఇసుకను అందుబాటులో లేకుండా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. భవన నిర్మాణ కార్మికులు కరోనా సమయంలో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఒక్క రూపాయి కూడా వెల్ఫేర్ బోర్డు ద్వారా చెల్లించలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డులో వున్న సొమ్మును ప్రభుత్వం తమ ప్రచార ఆర్భాటాలకు ఉపయోగించుకుంది తప్ప కార్మికుల సంక్షేమానికి ఖర్చుపెట్టలేదని తెలిపారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదంలో మరణించినా, అంగవైకల్యం చెందినా, కుటుంబంలో ఆడ పిల్లలకు వివాహం జరిగినా గతంలో ఇస్తున్నటువంటి డబ్బులను ఆపివేసిందన్నారు. తక్షణమే వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లైములను లేబర్ డిపార్టుమెంట్ ద్వారా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. ప్రజలందరికీ ఇల్లు కడుతున్న భవన నిర్మాణ కార్మికులకు సొంత ఇల్లు లేకపోవడం శోచనీయమన్నారు. వెంటనే ఇల్లు లేని కార్మికులకు ఇల్లు నిర్మించే చర్యలను ప్రభుత్వం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసరావు పూర్వ ప్రధాన కార్యదర్శి జి.పోలేశ్వరరావు, నాయకులు కె.నర్సింగరావు, రమణ, లక్ష్మణ, రాజు, చంద్రరావు, సూరప్పడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరగనున్నట్లు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎ.గిరిధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని న్యాయ స్థానాల్లో పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇనిస్ట్రుమెంట్ చట్టం కేసులు, ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తగాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాద కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. రాజీమార్గమే రాజమార్గమని, కావున కక్షిదారులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విశాఖపట్నం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

అధునాతన డిజైన్లతో ప్లాటినం ఆభరణాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అధునాతన డిజైన్లతో ప్లాటినం ఆభరణాల శ్రేణి లవ్ బ్యాండ్లను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్ ఇండియా బిజినెస్ డైరెక్టర్ పల్లవి శర్మ చెప్పారు. శుక్రవారం ఉదయం బీచ్ రోడ్డులోని నోవాటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 95 శాతం స్వచ్ఛమైన ఆభరణాలు తమ వద్ద లభిస్తాయన్నారు.

విజయవాడ థర్మల్ పవర్‌ప్లాంట్ పర్యావరణానికి హానికరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజయవాడ థర్మల్ పవర్ ప్లాంట్ పర్యావరణ చట్టం కింద ఇచ్చిన అనుమతులను ఉల్లంఘిస్తూ పరిసర గ్రామాల మీద కాలుష్యం వెదజల్లుతోందని, దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలని విశ్రాంత ఐఎఎస్ అధికారు ఇఎఎస్.శర్మ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ ద్వారా తెలిపారు. ఆ వివరాలను ఆయన శుక్రవారం వెల్లడించారు. ఆయా గ్రామాల ప్రజలను కొన్ని నెలల కింద తాను కలిసినప్పుడు వారు ఆ కాలుష్యం వల్ల ఎలా ఇబ్బంది పడుతున్నదీ తెలిసిందన్నారు.

నేటి నుంచి సురభి నాటకాలు

ప్రవేశం ఉచితం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 29 నుంచి విశాఖ నగరంలోని మద్దిలపాలెం కళాభారతి ఎసి ఆడిటోరియం వేదికగా వారం రోజులు పాటు సురభి నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి వెల్లడించారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశ నాటక రంగ చరిత్రలో సురభికి ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. 140 సంవత్సరాలుగా భారత్ సహా బర్మా, ప్యారిస్ తదితర దేశాల్లో కూడా ఈ నాటకాలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అటువంటి సురభి నాటకాలను రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యాన వందకుపైగా విశాఖలో ప్రదర్శింపజేసినట్టు పేర్కొన్నారు. ఈ ఏడాదికిగాను ఈ నెల 29న మాయాబజార్, 30న భక్త ప్రహ్లద, జులై 1న లవకుశ, 2న భూకైలాస్, 3న పాతాళ భైరవి, 4న శ్రీకృష్ణ లీలలు, 7న మాయాబజార్ నాటకాన్ని కళాభారతి యాజమాన్యం సహకారంతో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమ ముఖ్య నిర్వాహకులుగా తనతోపాటు సీనియర్ జర్నలిస్టు నాగనబోయిన నాగేశ్వరరావు వ్యవహరిస్తారన్నారు. ఎస్ఆర్‌కె. ఇన్ఫ్రా ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ ఎమ్ఎస్ఎన్.రాజు, ఉపకార్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కంచర్ల అచ్యుతరావు, కళా హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పివి.రమణమూర్తి, కార్మిక నాయకులు వివి.వామనరావు, ప్రముఖులు వివి.రమణమూర్తి, డాక్టర్ సూరపనేని విజయకుమార్, మాపూరి వెంకటరమణ, పైడా కృష్ణ ప్రసాద్ వంటి కొంతమంది నగర పెద్దల సహకారంతో ఈ సురభి నాటకోత్సవాలను ఏర్పాటు చేశామన్నారు. నాటకాలను తిలకించడానికి ఏ విధమైన ప్రవేశ రుసుమూ లేదని, అందరూ ఆహ్వానితులేనని అన్నారు. నాటకాన్ని తిలకించిన తర్వాత ప్రేక్షకులు తమ సహాయ సహకారాలను సురభి కళాకారులకు, సురభి సహాయ నిధికి అందజేయవచ్చని తెలిపారు. నాటకోత్సవాలను విశాఖ వాసులు జయప్రదం చేయాలని కోరారు. మీడియా సమావేశంలో నాగనబోయిన నాగేశ్వరరావు, వరె నాంచారయ్య, ప్రముఖ నటి శివజ్యోతి, నటుడు రమేష్ యాదవ్, రచయిత రవి బ్రహ్మ పాల్గొన్నారు.

నాటకోత్సవాల వివరాలు వెల్లడిస్తున్న బాదంగీర్ సాయి

భారీ వాహనాల రాకపోకలతో
రహదారి ఛిద్రం.!

జగ్గు జంక్షన్‌కు వెళ్లే మార్గంలో రూపు కోల్పోయిన తారురోడ్డు

- గోతుల రోడ్డులో బిక్కుబిక్కుమంటూ ప్రయాణం
- అదానీ గంగవరం పోర్టు వాహనాలే వల్లే దుస్థితి
- జగ్గు సెంటర్ నుంచి రోడ్లు మరింత అధ్వానం
- ప్రజల ఆందోళన, మొరపట్టని అధికారులు, నేతలు

ప్రజాశక్తి -గాజువాక: ఆదాని గంగవరం పోర్టుకు నిత్యం వందలాదిగా వస్తున్న భారీ వాహనాలతో జగ్గు సెంటర్ నుండి అటూఇటుగా వున్న వందల అడుగుల రోడ్డు నిండా గోతులమయమైంది. రోడ్డు నిర్మాణం చేపట్టి, మూడు నెలల తిరక్కుండానే రహదారి మొత్తం పూర్తిగా పాడైంది. భారీ వాహనాలు సైతం ఈ గోతుల్లోదిగితే, వాటి బాడీలు రోడ్డును అంటుకుపోయేంతగా పెద్దగోతులు ఏర్పడి, రాకపోకలకు ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే దిక్కు లేదని ఆందోళన వ్యక్తమౌతోంది.

గంగవరం పోర్టుకు వచ్చే భారీ వాహనాల రాకపోకల వల్లే రోడ్డు పాడవ్వడంతోపాటు, ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నా పట్టించుకునే దిక్కులేదు. జగ్గు సెంటర్ నుండి స్వతంత్ర నగర్‌కు వెళ్లే పోర్ట్ రోడ్‌లో భారీ గోతులు ఏర్పడ్డాయి, అలాగే జగ్గు సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వైపు వెళ్లే వంద అడుగుల రోడ్డు కూడా నిండా భారీ గోతులతో ఛిద్రమైంది. భారీ వాహనాల్లో తరలిస్తున్న సరుకుల బరువుకు తట్టుకునే సామర్థ్యం లేని రోడ్డు కావడంతో పదేపదే పునర్నిర్మిస్తున్నా, మూణ్నాళ్లయినా తిరక్కుండానే మళ్లీ పాడవుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాక నివాసప్రాంతాల మధ్య గుండా ఈ రోడ్డు ఉండడం, అందులో రేయింబవళ్లు అనే తేడాలేకుండా భారీ వాహన రాకపోకలు సాగిస్తుండడంతో కాలుష్యం, ప్రమాదాలతో జనం నిత్యం బిక్కచచ్చి పోతున్నారు. దీనిపై వామపక్షాలు, ప్రజాసంఘాలతో పాటు స్థానిక ప్రజలు పలుమార్లు ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేపట్టినా పట్టించుకునే దిక్కులేదు.

భారీ గోతులమయమైన ఈ మార్గంలో పాఠశాలలకు వెళ్లే బస్సులు, విధులకు వెళ్లే ఉద్యోగులు బైక్‌లు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రివేళ ఈ రోడ్డులో ప్రయాణం ప్రాణాంతకంగా ఉందని ఆందోళన వ్యక్తమౌతోంది. ఇక్కడ వీధిదీపాలు పూర్తిస్థాయిలో లేక అంధకారం అలుముకోవడం, ఎదురుగా వచ్చే భారీ వాహనాల హెడ్‌లైట్ల వెలుగులో రోడ్డు కనిపించకపోవడం, నిండాగోతులైన రోడ్డులో ఏ గోతిలో దిగితే ఏం జరుగుతుందోనన్న భయంగా ప్రాణాలను అరచేతిలో పట్టుకుని గమ్యం చేరేంతవరకు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, ఆదానీ గంగవరం పోర్టుకు వెళ్లే వాహనాలను ఈ మార్గంలో, జనవాసాల మధ్య నుంచి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లేలా ఏర్పాటు చేయడం ద్వారా జగ్గుజంక్షన్ మీదుగా వెళ్లే రోడ్డును పరిరక్షించడంతోపాటు, ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

చోరీ కేసులో నిందితునికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి - విశాఖ లీగల్ : దొంగతనం చేశాడన్న నేరాభియోగం రుజువు కావడంతో ఒక వ్యక్తికి మూడేళ్లజైలు శిక్ష, రూ.పది వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నం మహానగరం మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే, మరో మూడు నెలలు సాధారణ జైలు అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. కేసులో వాదనలు వినిపించిన సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలుపిల్లి ఆదినారాయణ తెలిపిన వివరాలివి.

ఎస్‌కెఎంఎల్ నగర్ ఆరిలోవ కాలనీకి చెందిన నడిగట్ల ఎల్లాజీరావు 2021 డిసెంబర్ 7న తాళాలు వేసి ఉన్న ఇంటి తలుపులను పగలగొట్టి, ఇంట్లోని బంగారుగాజులతోపాటు రూ.14,500నగదు చోరీ చేశారు. అరుకు టూరు నుంచి తిరిగొచ్చిన బాధితులు ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్ట్‌చేసి, కోర్టులో నేరాభిపత్రాలను దాఖలు చేయగా, విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు ఎల్లాజీకి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారన్నారు.

అనధికార నిర్మాణం కూల్చివేత

జివిఎంసి అధికారులు కూల్చేసిన అనధికార నిర్మాణం

ప్రజాశక్తి- సీతమ్మధార :జివిఎంసి 24 వ వార్డులో అనధికారికంగా చేపట్టిన అదనపు అంతస్తు భవన నిర్మాణ పనులను శుక్రవారం జివిఎంసి మూడవ జోన్ పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా టిపిఒ ప్రమీల మాట్లాడుతూ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన యజమానులు అనుమతులకు లోబడి నిర్మాణాలను చేపట్టాలన్నారు. ప్లానింగ్ సెక్రటరీ వెంకటలక్ష్మి, ఇతర సిబ్బంది ఉన్నారు.

సేవ చేస్తా.. ఛాన్సివ్వండి.!

ప్రజాశక్తి -ఆనందపురం : పార్టీకి, ప్రజలకు సేవ చేసేందుకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడిగా తనకు ఒక్క అవకాశమివ్వాలని బంటుపల్లికి సీనియర్ టిడిపినేత బంటుపల్లి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ, తన తండ్రి బంటుపల్లి అప్పారావు మూడు పర్యాయాలు పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారని, తండ్రి నుంరి రాజకీయ వారసత్వం అందుకున్న తనకు మండల ప్రజలు, నేతలతోపాటు రాష్ట్రస్థాయి నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. మండలంలోని 26 పంచాయతీల్లో రాజకీయ పరిస్థితులు, ప్రజాసమస్యలపై కూడా అవగాహన ఉందని, తనకు పార్టీ మండల అధ్యక్షుడిగా ఒక్క ఛాన్సివ్వాలని శ్రీనివాసరావు కోరారు.

‘విద్యా ప్రవేశం’పై అవగాహన ర్యాలీ

మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

ప్రజాశక్తి -ఆనందపురం : మండల కేంద్రంలో ‘విద్యా ప్రవేశం’ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ గంగరాజు మాట్లాడుతూ, ఈనెల 24 నుంచి వచ్చేనెల 25 వరకు నిర్వహించే విద్యాప్రవేశం కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.బడిఈడు పిల్లలను పాఠశాలకు పంపకపోవడం, ఇతర పనులు చేయించడం నేరమన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని ,వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె .సుబ్బలక్ష్మి, యు. ఉదయ రాణి, జివి. ప్రవీణకుమారి , బి.వరలక్ష్మి, సిఆర్.పిలు షిణగం శివాజీ, బంటుపల్లి. గౌరీ శంకరరావు, గొంతిన శివాజీ, బంక. దుర్గ, పాలవలస వెంకటరావు, సహిత విద్య ఉపాధ్యాయులు కలమ శ్రీనివాసరావు, .నాగమణి పాల్గొన్నారు.

బాలికకు విద్యాప్రవేశం

భీమునిపట్నం :విద్యాప్రవేశ్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని సింగనబంద గ్రామ పంచాయితీ మద్దిలపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బడి బయట ఉన్న ఓ బాలికను పాఠశాలలో చేర్పించారు. ఎంఇఒలు ఎం శివరాణి, జయప్రద, సిఆర్‌పి సూర్య నారాయణ, హెచ్ ఎం పాల్గొన్నారు

బాల్య వివాహాల అనర్థాలపై నృత్యరూపకం

ప్రజాశక్తి -గాజువాక : :-బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కళాజాతా నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. జివిఎంసి 74వ వార్డు, దయాల్ నగర్-2 అంగన్వాడీ కేంద్రం వద్ద ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల తలెత్తే ఇబ్బందులను ఆట, పాటల ద్వారా కిశోరబాలికలు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు వివరించారు. బాలల హక్కులు, చట్టాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్,అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్గించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త పి బేబీ కళావతి, ఎమ్ఎస్ కె.సత్యవతి, పి సుజాత, పి శివప్రభ, ఎం చిట్టమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుకాణ సముదాయానికి స్లాబ్ వేయండి

షాపింగ్ కాంపెక్స్ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి దుకాణ సముదాయం పైకప్పును రేకులతో కాకుండా పూర్తి స్థాయిలో స్లాబు వేయాలని జెడ్‌సి కనకమహాలక్ష్మి, పట్టణ ప్రణాళికావిభాగం ఎసిపి డి.శ్రీనివాసరావులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం మెయిన్ రోడ్డు పక్కన నిర్మాణంలో ఉన్న షాపింగ్ కాంపెక్స్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ వివరాలు, బిల్లుల చెల్లింపుపై అధికారులను ప్రశ్నించారు. రూ.1.66 కోట్ల నిధులతో ముందు వరుసలో 12, వెనుకన 28 దుకాణాలను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే గంటాకు ఎసిపి శ్రీనివాసరావు వివరించారు. ఇప్పటివరకు కేవలం రూ.పది లక్షలు మాత్రమే నిధులు విడుదలయ్యా యన్నారు. పూర్తిస్థాయిలో నిధులు లేనందువల్లే పైకప్పును శ్లాబ్ కాకుండా రేకులు వేస్తున్నట్లు ఎమ్మెల్యే గంటాకు అధికారులు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే గంటా స్పందిస్తూ, శాశ్వతంగా ఉండేలా పైకప్పు శ్లాబ్ వేయాలని, నిధులు చాలకుంటే దుకాణాల సంఖ్యను కుదించాలని సూచించారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారమే రోడ్ల విస్తరణ

జోన్ పరిధిలో ప్రతిపాదించిన ఏడు రోడ్లను మాస్టర్ ప్లాన్ ప్రకారమే విస్తరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతల వారీగా తొలుత ప్రధాన రహదారిని విస్తరించాలన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి గంట స్తంభం వరకు, అలాగే గంట స్తంభం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు (ప్రస్తుతమున్న రోడ్డును 66 అడుగులకు విస్తరించాలని ఆదేశించారు. ఎస్‌బిఐ నుంచి బీచ్ రోడ్డు మీదుగా జెడ్‌పి గెస్ట్ హౌస్ వరకు రోడ్డును 60 అడుగుల వెడలు చేయాలన్నారు.విస్తరణలో ఆస్తులను కోల్పోయిన వారికి వాటి విలువకు నాలుగురెట్లు టిడిఆర్ ఇస్తామని ఎసిపి వివరించారు మెయిన్ రోడ్డులో 60, బీచ్ రోడ్డులో దాదాపు 45 శాశ్వత దుకాణాలు, ఇళ్లు కోల్పోయే అవకాశం ఉందని ఎసిపి తెలిపారు. తగరపువలసలోనూ రోడ్డు విస్తరణ చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు.

పింఛన్ల పంపిణీపై గంటా సమీక్ష

భీమునిపట్నం : పింఛన్ల పంపిణీపై స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఆర్‌డిఒ ఎస్ భాస్కర రెడ్డి, జివిఎంసి వివిధ జోన్ల కమిషన ర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో పింఛన్ల పంపిణీకి ప్రభుత్వ మార్గదర్శకాలపై సమీక్షించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి చిక్కాల విజయబాబు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- పెందుర్తి: జివిఎంసి 97వ వార్డు చినముషిడివాడ కూడలి సమీపంలో కొలువైన పంచముఖ ఆంజనేయ స్వామి 14వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ ధర్మకర్త శానాపతి శంకరరావు వసంత ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, స్థానిక టిడిపి నాయకులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టారు.

రుషికొండ వెంకన్నకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -మధురవాడ : రుషికొండలోని వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి శేష వస్త్రం, పూలమాలలను ఊరేగింపుగా తీసుకెళ్లి, వాటిని విశేషంగా అలకరించి భక్తులకు దర్సనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఉక్కు క్యాంటీన్లు మూతబడితే ఊరుకోం!

ప్రజాశక్తి-ఉక్కునగరం : కాంట్రాక్టర్‌కు స్టీల్‌యాజమాన్యం బిల్లులు చెల్లించకపోవడం వల్ల వచ్చేనెల ఒకటి నుంచి నాలుగు జోన్లలో క్యాంటీన్లు మూతబడే పరిస్థితి ఉందని, దీనిపై అధికారులు దృష్టిపెట్టి తగు చర్యలు చేపట్టాలని స్టీల్ ప్లాంట్ కేంటీన్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు పూర్వ గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరాం కోరారు. ఉక్కు క్యాంటీన్ల నిర్వహణకు ఎటువంటి ఆటంకమేర్పడినా ఆందోళన చేయక తప్పదని ఉక్కు యాజమాన్యాన్ని హెచ్చరించారు. శుక్రవారం ఇడి వర్క్స్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతూ, యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా క్యాంటీన్లు మూతబడే పరిస్థితులు క ల్పించి, పర్మినెంటు కార్మికులకు భోజనాలు, అల్పాహారం, టీ లేకుండా చేస్తే ఊరుకోబోమన్నారు. ప్రధాన కార్యదర్శి పి నారాయణరావు మాట్లాడుతూ క్యాంటీన్ల నిర్వహణకు ఆటంకం లేకుండాచూడాలన్నారు. దీనిపై హెచ్ఆర్ జిఎం భాను స్పందిస్తూ, క్యాంటీన్ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లుల సమస్యపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో హెచ్ఆర్ అధికారులు సెహగల్, యూనియన్ నేతలు బి కన్నబాబు. ఆదిరెడ్డి, జి శ్రీనివాసరావు. కె.సురేష్, డి గణేష్, శ్రీను, రాజు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు

ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరాం

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

వెంకటాపురంలో సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం : వార్డుల పరిధిలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గణబాబు సూచించారు. శుక్రవారం జివిఎంసి ఎనిమిదో జోన్ కమిషనర్, రెవెన్యూ, ఇతర అధికారులతో కలిసి 92వవార్డు వెంకటాపురంలో పర్యటించారు. ఈ సందర్భంగా శిథిలావస్థలో వున్న వాటర్ ట్యాంక్‌ను వెంటనే తొలగించాలని తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఆదేశించారు. వెంకటాపురం ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, యుసిడి పైపులైన్, విద్యుత్ మరమ్మతులు ఇతర సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వెంకటాపురం శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తను పరామర్శించారు. కార్యక్రమంలో కూటమి నేతలు బాలసుబ్రహ్మణ్యం, నందవరపు సోములు, బొడ్డేటి విజయ్, కంపర ఆనంద్, మూర్తి పట్నాయక్, సత్తిరాజు, లత, దాడి రమేష్‌నాయుడు, ఇల్లపు కనకరాజు, అల్లం రమేష్ , శంకర్, గుంతిని శ్రీనివాసరావు, సతీష్, వీర్రాజు, ప్రసాద్, పాతిన సురేష్, జి.కృష్ణ, బాబు పాల్గొన్నారు.

యునిసెఫ్ అంబాసిడర్లుగా ఓక్రిడ్జి విద్యార్థులు

యునిసెఫ్ సమ్మిట్‌లో ఓక్రిడ్జి విద్యార్థులు

ప్రజాశక్తి-తగరపువలస : భీమిలి మండలం, సింగనబంద ఓక్రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎస్ సూర్య తేజ, ఆన్యా వి, సృజన్ ఇటీవల హ్యూస్టన్‌లో జరిగిన యునిసెఫ్ సదస్సులో యునిసెఫ్ అంబాసిడర్లుగా వ్యవహరించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ శైల భమిడిపాటి శుక్ర వారం తెలిపారు. యునిసెఫ్ సమ్మిట్ ఇన్నోవేషన్‌లో ఆరు రోజులపాటు పాల్గొన్న వీరు, పర్యావరణం మార్పు నుంచి విద్యా ప్రవేశం వరకు వివిధ అంశాలపై జరిగిన వర్క్‌షాప్‌లో లోతైన అవగాహన పొందారు. సమ్మిట్‌లో విద్యార్థులు పొందిన అనుభవాలు, భవిష్యత్ ప్రయత్నాలకు ఇతర విద్యార్థులకు మార్గదర్శనంగా ఉండనున్నట్లుఆశాభావం వ్యక్తంచేశారు. 120 కంటే ఎక్కువ నార్త్ ఆంగ్లేయ విద్యార్థులు ఈ సమ్మిట్‌లో పాల్గొన్నట్లు వివరించారు యునిసెఫ్ సమ్మిట్‌లో ఎన్ఎఐ , యునిసెఫ్ అంబాసిడర్లుగాగా వ్యవహరించడం తమకు ఎంతో గర్వంగా ఉందని వీరు తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

పుస్తకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంఇఒ

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని కోరాడ ప్రాథమిక పాఠశాలలో 85 మంది విద్యార్థులకు శుక్రవారం ఎస్ఒఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమం ద్వారా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కోరాడ లక్ష్మణ, ఎంఇఒ రమణ, హెచ్ఎం పాల్గొని పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ మాట్లాడుతూ, పిల్లలు విద్యా సదుపాయాలతో పాటు మహిళాభ్యున్నతికి ఎస్ఒఎస్ సంస్థ ఆర్థికంగా దోహదపడడడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ ఇన్‌ఛార్జి కె .దుర్గారాజు, తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణా చర్యలపై తనిఖీలు

పాఠశాల సందర్శనలో కేంద్ర బృందం ప్రతినిధులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఎనీమియా ముక్త భారత్ కార్యక్రమం భాగంగా జిల్లాలో రక్తహీనత నివారణకు చేపడుతున్న కార్యక్రమాల అమలుపై శుక్రవారం కేంద్రబృందం పరిశీలించింది. మండలంలోని బోయపాలెం, గంభీరం, చందక గ్రామాల్లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎకనామిక్ గ్రోత్, కేంద్ర కార్యాలయ అధికారి డాక్టర్ ఎస్ పూజిత, ఎనీమియా ముక్త భారత్ జిల్లా ప్రోగ్రాం అధికారి సమత, డాక్టర్ హీనా దీక్షిత్, జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సు మనోరమ ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎం గంగునాయుడులతో కూడిన బృందం వైద్యఆరోగ్యశాఖ, ఐసిడిఎస్ పనితీరును పరిశీలించారు. బోయపాలెం ఉన్నత పాఠశాలను సందర్శించిన బృందం, అక్కడ విద్యార్థుల రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు ఇస్తున్నదీ లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకుని సంతృప్తి చెందారు. హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులను తనిఖీ చేశారు.. అనంతరం గంభీరం హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల రక్తహీనత నివారణకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న గర్భిణులకు మందులు, పౌష్టికాహారం పంపిణీపై ప్రశ్నించారు. చందకలోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌నూ బృందం పరిశీలించింది. సిహెచ్ఒ పి సాంబమూర్తి, సిడిపిఒ మామిడి శ్రీదేవి, పర్యవేక్షకులు రత్నం, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్ పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశాలు పాల్గొన్నారు.

30 నుంచి రెండోవిడత డిప్లమో వెబ్ ఆప్షన్లు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో డిప్లమో కోర్సు ప్రవేశాలకు రెండో విడత కౌన్సెలింగ్ నిమిత్తం ఈ నెల 30 నుంచి వచ్చేనెల 4 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ ఎం జ్యోతి కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతలో వెబ్ ఆప్షన్లు ఇవ్వనట్లయితే, సీటు పొందని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రెండో విడతలో వెబ్ ఆప్షన్లు ఎంచుకున్న వారికి జూలై 5నుంచి 7 వరకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు .8 వ తేదీన ప్రవేశానికి ప్రొవిజన్ లెటర్లు అందజేస్తామని తెలిపారు

ఉపాధ్యాయ వృత్తిలో ఆత్మ సంతృప్తి

రేపు ఉద్యోగ విరమణ చేయనున్న శ్రీనివాసరావు ... నేడు ఆత్మీయ అభినందన

శ్రీనివాసరావు, శ్రీనాగలక్ష్మి దంపతులు

ప్రజాశక్తి- ఆనందపురం : ఉపాధ్యాయ వృత్తినే దైవంగా భావించి పనిచేయడం వలన ఎంతో ఆత్మసంతృప్తిని పొందవచ్చునని ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న శ్రీనివాసరావు ప్రజాశక్తితో మాట్లాడారు.

విజయనగరం కోటమదపువీధి చెందిన వెంకట రమణయ్య, రామలక్ష్మి దంపతులకు ఒక కుమార్తె, నలుగురు కుమారులున్న ఐదుగురు సంతానంలో చివరివాడిగా బుడ్డేపు శ్రీనివాసరావు 1965మే 22 న జన్మించారు.తండ్రి ప్లీడర్ గుమస్తా కాగా తల్లి గృహిణి. శ్రీనివాసరావు ప్రాథమిక విద్య నుంచి ఇంటర్ వరకు అంతా విజయనగరంలో పూర్తి చేశారు. గోపాలపట్నంలో .టిటిసి పూర్తి చేసి, సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా చేరారు. డిగ్రీ, బిఇడి, పిజి దూరవిద్య విధానంలో అభ్యసించిన శ్రీనివాసరావు, 1986లో ఉపాధ్యాయునిగా ఎంపికై విశాఖపట్నం జిల్లా దానవోయినపాలెం, సబ్బవరం సమితి ప్రాథమిక పాఠశాలలో, అనంతరం పద్మనాభ మండలం బొచ్చుపేట ప్రాథమికపాఠశాల, గెద్ద పేట ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. ప్రమోషన్‌పై విజయానందపురం ఎంపియుపి పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా చేరి, అదే పాఠశాల ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యాక అక్కడ పనిచేశారు. అనంతరం పద్మనాభం ఉన్నత పాఠశాల, బాపిరాజు తాళ్ళవలస ఉన్నత పాఠశాలల్లో పని చేశారు. గ్రేడ్-2 హెచ్ఎంగా ఉద్యోగోన్నతి పొంది, ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావు మాస్టారు., ఈనెల 30న స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందుతున్నారు

కుటుంబ నేపథ్యం

1994 ఫిబ్రవరి 27న శ్రీనాగలక్ష్మిని వివాహం చేసుకున్న శ్రీనివాసరావుకు ఇద్దరు సంతానం, కుమారుడు ప్రవీణ్‌కుమార్ బిటెక్ పూర్తిచేసి, బెంగళూరులో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె హారిక చార్టెడ్ అకౌంటెంట్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నారు. ఉద్యోగవిరమణ అనంతరం స్వగ్రామంలో భార్య పిల్లలతో గడుపుతానని శ్రీనివాసరావు తెలిపారు

చేతి వృత్తులకు చేయూత

వెంకటరావుకు అవార్డులు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఉక్కునగరం :ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలలో చేతివృత్తులు అంతరించిపోకుండా వృత్తి అనుభవం గల వారిని తీసుకొని కుటుంబ జీవనోపాధి సమస్యగా ఉన్నవారికి ఈ వృత్తిపై శిక్షణనిచ్చి ఉపాధి మార్గాన్ని చూపిస్తున్న ఎంవిఆర్ గ్రూప్ ఆఫ్ స్మాల్ స్కేల్ యూనిట్స్ సంస్థ అధినేత మొల్లేటి వెంకటరావు అభినందనీయుడని పలువురు అన్నారు. శుక్రవారం మక్స్ గ్లోబల్ ఫౌండేషన్ నిర్వహించిన 'గ్లోబల్ అవార్డ్స్ సెలబ్రేషన్స్-2024' గోల్డెన్ నంది అవార్డులు, గ్లోబల్ ఇన్‌స్పైర్ అవార్డులను హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో అందజేసారు.

మక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దినేష్ చెరిపెల్లి మట్లాడుతూ వ్యక్తులలో ఉన్నా టాలెంట్‌ను గుర్తించి, వారి ప్రతిభను ప్రపంచానికి తెలియజేయడం కోసమే ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమ లో వివిధ రంగాల్లో సేవలు అందించిన వారిని సత్కరించామన్నారు. కొన్ని రంగల్లో సేవాలు అందించిన వారికి సన్మానించారు.తెలంగాణ పూర్వ అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ శాఖ చైర్మన్ డాక్టర్ రియాజ్ ముఖ్య అతిథిలుగా, హెచ్ పార్మినెంట్ మేకప్ క్లినిక్, వ్యవస్థాపకులు హర్షిత కార్తీక్ అతిథిగా పాల్గొన్నారు.

ఎపిఎల్ సీజన్-3 క్రికెటర్ల సందడి

సాధన చేస్తున్న క్రీడాకారులు

ప్రజాశక్తి -పిఎం పాలెం: పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ, విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం 'బి' గ్రౌండ్‌లో శుక్రవారం ఎపిఎల్ సీజన్ -3 ఆటగాళ్ల సందడి నెలకొంది. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) మూడో సీజన్ ఆదివారం నుంచి డాక్టర్ ఈ స్టేడియంలో ప్రారంభం కానుంది. ఇందులో రాయలసీమ కింగ్స్, కోస్టల్ రైడర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్, బెజవాడ టైగర్స్, వైజాగ్ వారియర్స్ జట్లు తలపడనున్నాయి. ఆయా జట్ల కెప్టెన్లు కె.ఎస్.భరత్, పి.గిరినాథ్‌రెడ్డి, సి.ఆర్.జ్ఞానేశ్వర్, ఎస్.కె.రషీద్, జి.గుల్ఫామ్ సాలెతో పాటు మిగిలిన ప్లేయర్లు ముమ్మరంగా ప్రాక్టీసు చేశారు.

నేతల ఒత్తిళ్లతో ఉద్యోగులు సతమతం!

ప్రజాశక్తి- పెందుర్తి: అక్రమ నిర్మాణాలు, ఆక్రమణల తొలగింపులో జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు నిబంధనలకు అనుగుణంగా పనిచేసుకోనివ్వక అధికారపార్టీ నేతలు మోకాలడ్డుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జివిఎంసి 97వ వార్డు ముషిడివాడ మెయిన్ రోడ్డును ఆనుకొని ముందస్తు అనుమతులతోనే భవనం నిర్మిస్తున్నప్పటికీ, రెండు అడుగుల మేర తేడా వచ్చిందని స్థానిక టిడిపి నేతలు జివిఎంసి అధికారులకు ఫిర్యాదు చేశారు.

దీనిపై స్పందించి, పరిశీలనకు వెళ్లిన జివిఎంసి టౌన్‌ప్లానింగ్, సచివాలయాల సిబ్బంది, నిర్మాణంలో వ్యత్యాసాన్ని గుర్తించి, తొలగించేందుకు సిద్ధపడుతుండగా, బిజెపి నేత నుంచి ఫోను రావడంతో విరమించుకున్నట్లు తెలిసింది. ఇలా అధికారుల పని చేసుకోనివ్వక రాజకీయపార్టీల నేతలు ఒత్తిళ్లు తేవడం ఇక్కడ చర్చనీయాంశమైంది.

పెంచిన జియో రీఛార్జ్ ఛార్జీలను తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి అచ్యుతాపురం

రిలయన్స్ జియో సంస్థ పెంచిన రీఛార్జ్ ప్లాన్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం అచ్యుతాపురంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్యుతాపురం కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే రిలయన్స్ జియో రీఛార్జ్ ప్లాన్లను 25 శాతం పెంచి, ప్రజలపై భారం వేయడం అన్యాయమన్నారు. రిలయన్స్ ప్రైవేట్ సంస్థపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో జియో ఇష్టానుసారం ప్రజలపై భారాలు వేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్థ తొలుత ఉచితం అని తర్వాత తక్కువ డబ్బులని వసూలు చేసి ఇప్పుడు అన్ని నెట్ వర్క్‌ల కంటే ఎక్కువ ధరలు వసూలు చేయటం అన్యాయమన్నారు. 28 రోజులకు రూ.155 నుండి రూ.189కు, 209 నుండి 249కు, 239 నుండి 299కు, 479 నుండి 579కు పెంచినట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని అడ్డు అదుపు లేకుండా పెంచుతున్న టారిఫ్ ధరలను తగ్గించాలని, రిలయన్స్ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేష్, నానాజీ, సత్తిబాబు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెల్ ఫోన్లు చూపుతూ నిరసన తెలుపుతున్న దృశ్యం


వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యా రంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి -అనకాపల్లి

రైట్ టు ఎడ్యుకేషన్ ద్వారా ఎంపికైన విద్యార్థుల నుంచి ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ఫీజులు వసూలు చేయరాదని కోరుతూ శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రమణ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో వసూలు చేసే ఫీజును నోటీసు బోర్డులో ఉంచాలని, ఆర్‌టిఈ నోడల్ ఆఫీసర్ శ్రీలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం ద్వారా చేరిన విద్యార్థుల దగ్గర ఫీజులు వసూలు చేస్తే మధ్య తరగతి విద్యార్థులు ఎలా ఇవ్వగలరన్నారు. ఇప్పటి వరకు ఫ్రీ సీట్లు అని చెప్పి ఇప్పుడు ఫీజులు వసూలు చేయడం సరికాదన్నారు. పుస్తకాలు, యూనిఫామ్‌లు అమ్మడం దారుణమన్నారు. నాసిరకమైన బస్సులతో విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న ఫీజులు నోటీస్ బోర్డ్‌లో ఉంచాలని, అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అధిక ఫీజు వసూలుపై చర్యలు తీసుకోవాలి

యలమంచిలి : నిబంధనలకు విరుద్ధంగా స్థానిక ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పాఠ్యపుస్తకాలు, యూనిఫారం అమ్ముకుంటూ అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థులను దోచుకుంటున్నారని, ఆయా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఏఎస్ఎఫ్ఐ ప్రతినిధులు శుక్రవారం యలమంచిలి ఎంఇఒకు వినతి పత్రం సమర్పించారు. భాష్యం, శ్రీప్రకాష్ విద్యాసంస్థలతో పాటు పలు పాఠశాలల్లో పుస్తకాలు, దుస్తులు అమ్ముతూ అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తగిన ఆధారాలతో నిరూపించడానికి సిద్ధంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎంఇఒను కోరారు. లేని పక్షంలో సోమవారం ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బాబ్జీ, దుర్గారావు, శ్రీను, శివరాజు తదితరులున్నారు.

గోల్డ్‌మెడల్ చూపుతున్న రామారెడ్డి

రైఫిల్ షూటింగ్‌లో రామారెడ్డికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-చోడవరం : ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో ఈనెల 21 నుండి 28 వరకు నిర్వహించిన ఏపి రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ ఛాంపియన్ షిప్-2024లో పిస్టోల్ ఛాంపియన్ షిప్ మెన్ వ్యక్తిగత కేటగిరీలో చోడవరానికి చెందిన నల్లమిల్లి శ్రీసుందర రామారెడ్డి (14) 371/400 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. రామారెడ్డి మరో సారి తన ప్రతిభను చూపి ఘన విజయం సాధించడం పట్ల పలువురు ప్రముఖులు అభినందించారు. కోచ్ రామ్మోహన్ సారథ్యంలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని పలువురు ఆకాంక్షించారు. తల్లిదండ్రులు నల్లమిల్లి గనిరెడ్డి శ్రీలక్ష్మి, సోదరులు సూర్య రాఘవ రెడ్డి (సూర్య) పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

సెజ్ పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న పరిశ్రమల ప్రతినిధులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్ పరిశ్రమలలో స్థానికులకు ఉపాధి కల్పించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. స్థానిక ఏపిఐఐసి ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఎస్ఇజెడ్ పరిశ్రమల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్‌ను పరిశ్రమల ప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. ప్రధానమైన సమస్యగా మారిన నిరుద్యోగ సమస్యపై దృష్టి సారిస్తానని తెలిపారు. డిగ్రీ, బిటెక్ చదివి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత పరిశ్రమల పైనా, తనపైనా ఉందని పేర్కొన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు ఆలోచించి ఉపాధి చూపించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు తదితర సమస్యలు తన దృష్టికి తెచ్చినట్లయితే ప్రభుత్వానికి తెలిపి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కోరుతూ శుక్రవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం ఆర్డీఓ అధికారి చిన్నికృష్ణకు పలు సమస్యలతో కూడిన వినత పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నేతలు మాట్లాడుతూ కొద్దిరోజుల నుంచి నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం చేత సామాన్య మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గడిచిన 20 రోజుల్లో కాయగూరల ధరలు సామాన్య ప్రజలకు అందనంత ఎత్తుకు పెరిగిపోయాయని, బియ్యంపై కేజీకి ఐదు రూపాయలు పెంచేసారని, పప్పులు, ఉప్పులు కాయగూరలు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యలపై దృష్టి సారించి నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడ అప్పారావు, సూరిబాబు, పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందజేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : అట్రాసిటీ కేసుల్లో బాధితులకు పరిహారం అందించాలని అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌కు జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు (డీవీఎంసీ) సభ్యులు మధు, అప్పలరాజు శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునగపాక పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నెంబర్ 58/2022 కు సంబంధించి బాధితులకు పరిహారం అంద లేదన్నారు. మునగపాక పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నెంబరు 48/2024 సంబంధించి బాధితులకు పరిహారం అందలేదని తెలిపారు. అలాగే గత సమావేశం జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీకి సంబంధించి నేటి వరకు జిల్లాలో అట్రాసిటీ కేసులు బాధితుల వివరాలను తెలియజేయాలని కోరారు. వారికి పరిహారం అందజేసిన వివరాలను తెలియజేయాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులపై మరింత అవగాహన కల్పించే కార్యక్రమాలు పౌర హక్కుల దినోత్సవం రోజున ఏర్పాటు చేయాలని కోరారు.

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ

కీటక జనిత వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం పరవాడ గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. దీనిని డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ దేవ్ పర్యవేక్షించారు. పరిసరాల పరిశుభ్రత గురించి, దోమలు పెరిగే ప్రదేశాల్లో ఏయే చర్యలు తీసుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమ లార్వా పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి ప్రజలకు ఏ విధంగా తెలియజేయాలో, జ్వర పీడితులకు రక్త పూతలు ఎలా సేకరించాలో, డెంగ్యూ, మలేరియా, బోదకాలు వ్యాధి గ్రస్తులకు తక్షణ వైద్య సదుపాయం ఏ విధంగా అందించాలో అనే అంశాలపై వైద్య ఆరోగ్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు. నీరు నిల్వ ఉన్న పల్లపు ప్రాంతాలను పర్యవేక్షించి వాటి నిర్మూలన చర్యలపై సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వ్యాధి నిరోధక కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిక, ఎస్ఓ రామచంద్రరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ సాయిరాం, పిహెచ్ ఎన్.జానకి రామన్, ఫార్మసిస్టు విజయ కుమారి, సచివాలయం కార్యదర్శి జి.అచ్యుతరావు, ఏఎన్ఎం. రత్నకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కశింకోట మండలంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కశింకోట : స్టాప్ డయేరియా అండ్ మలేరియా మాసోత్సవాల్లో భాగంగా కశింకోట మండలం బయ్యవరం గ్రామంలో డాక్టర్ ఎస్ తిరుపతిరావు ఆధ్వర్యంలో డయేరియా, మలేరియాపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీళ్లు, క్లోరినేషన్ అయిన నీళ్ల మాత్రమే తాగాలని సూచించారు. ఎవరైనా వ్యాధిగ్రస్తులు ఉంటే తక్షణమే హెల్త్ వెల్నెస్ సెంటర్లో ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పరమానందరావు, విజయలక్ష్మి, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని అచ్చెర్ల దళిత కాలనీలో తాళ్లపాలెం ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ కెజీ నర్సింగరావు, గ్రామ కార్యదర్శి మహేష్, టిడిపి నాయకులు తరిమా అప్పారావు సిబ్బంది ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

డయేరియా, మలేరియాపై అవగాహన ర్యాలీ

సుగర్ ఫ్యాక్టరీ సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్తాం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం సుగర్ ఫ్యాక్టరీ (గోవాడ) సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇంచార్జ్ పివిఎస్ఎన్.రాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జనసేన నాయకులు సుగర్ ఫ్యాక్టరీ ఎమ్‌డిని రైతులతో కలిసి ఫ్యాక్టరీ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్ల నుండి సుగర్ ఫ్యాక్టరీ మనుగడ కోసం అనేక పోరాటాలు చేసామని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వంలో జనసేన అధికార భాగస్వామిగా ఉన్నందున సుగర్ ఫ్యాక్టరీ ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను పరిష్కరించి, ఫ్యాక్టరీని గట్టి ఎక్కించడానికి, మళ్లీ అత్యధిక శాతం క్రషింగ్ జరిగేలా చూడటానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మాలు నాయుడు, డిఎస్ నాయుడు, మైచర్ల నాయుడు, మహారాజు, కర్రి రమేష్, సిరిపురపు రమేష్, గునూరు సూర్యనారాయణ, కర్రి తమ్మునాయుడు, మహేష్, మాలినాయుడు, నాలుగు మండలాల నుండి నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 18 వినతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీసు గ్రీవెన్సుకు 18 మంది పోలీసు సిబ్బంది తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాజరై వారి అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి విన్నపాలను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

మంజూరు కాని నిధులకు ఆడిట్ చేయడం విడ్డూరం

ప్రజాశక్తి -అనకాపల్లి

2023 - 2024 విద్యా సంవత్సరంలో జిల్లాలో ఏ పాఠశాలకు నిర్వహణ ఖర్చులకు ఎలాంటి నిధులు మంజూరు కాలేదని, మంజూరు కాని నిధులకు ఆడిట్ చేయడం విడ్డూరంగా ఉందని యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.శ్రీలక్ష్మి, గొంది చినబ్బాయ్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడి జి.రమాజ్యోతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న జులై 1, 2 తేదీలలో నర్సీపట్నం, కసింకోట కేంద్రాలలో, 2023 - 2024 సంవత్సరానికి గాను పాఠశాలల నిర్వహణ గ్రాంట్‌లకు జిల్లాలోని పాఠశాలలకు ఆడిట్ నిర్వహిస్తామని సర్వ శిక్ష అభియాన్ అధికారులు షెడ్యూల్ విడుదల చేశారని తెలిపారు. అయితే 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని పాఠశాలలకు ఎటువంటి నిర్వహణ నిధులు మంజూరు కాలేదని పేర్కొన్నారు. నర్సీపట్నం, కశింకోటలలో జిల్లా స్థాయి ఆడిట్ నిర్వహించడం వలన, బోధనా సమయం కుంటుపడడం తప్ప, ఎటువంటి ప్రయోజనం లేదని తెలిపారు. కావున గ్రాంట్స్ మంజూరు కాని పాఠశాలలకు ఆడిట్ నిర్వహించడం అర్థం లేదని, ఈ ఆడిట్‌ను వాయిదా వేయాలని కోరారు. దీనికి స్పందించిన ఏడి మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జిఎస్ ప్రకాష్, నాయకులు జీకేఆర్ స్వామి, అలి వేలు, బాబూరావు, సతీష్, సలీం, తేజవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ బాలాజీ

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీలు

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎంఎస్‌వికె.బాలాజీ శుక్రవారం సందర్శించారు. వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో పలు రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఒంపోలు గ్రామాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. జ్వరాలు, డయేరియా, వంటి వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుపరచాలని, పంచాయితీ కార్యదర్శి, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన కలిగించాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎన్.విమలగిరి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్.దేవకాంత, హెల్త్ సూపర్వైజర్ ఎం.నాగేశ్వరరావు, ఏఎన్ఎం నాగజ్యోతి, పంచాయితీ కార్యదర్శి, ఆశ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందించాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని సహాయ కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ అన్నారు. బాల కార్మిక నిర్మూలన మాసోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని పలు దుకాణాలు, హోటళ్లు, బేకరీలు, వ్యాపార సంస్థలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. 14 సంవత్సరాలలోపు బాల బాలికలను పనిలో పెట్టుకోవద్దని వ్యాపారస్తులకు సూచించారు. అతిక్రమించిన వారికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ మంగతాయారు, కె.కోటపాడు ఎఎస్ఐ, పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బుచ్చయ్యపేట ఎంపిడీవో టి.వెంకటాచార్య శుక్రవారం తెలిపారు. లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందించడానికి సచివాలయ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పెన్షన్‌దార్లకు పంపిణీ చేయడానికి నగదును మండలంలో 22 సచివాలయాల సిబ్బందికి అందజేసినట్లు తెలిపారు.

పల్లాకు వియ్యపు చిన్నా శుభాకాంక్షలు

ప్రజాశక్తి - పరవాడ : తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆయన్ను మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు బంధం వెంకటరమణ మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా పుష్పగుచ్ఛంతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

వ్యవసాయ గణనపై శిక్షణ

ప్రజాశక్తి-కె.కోటపాడు

స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 11వ అంతర్జాతీయ వ్యవసాయ గణన ఫేస్ 2పై గ్రామ రెవెన్యూ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తహశీల్దార్ జె.ఈశ్వరమ్మ జరిగిన ఈ కార్యక్రమంలో ఫేస్ 2లో 2021-2022 కాలంలో సాగు చేసిన వ్యవసాయ సాగు పంటలు, వ్యవసాయ విస్తీర్ణం నమోదు చేయవలసి ఉంటుందని చెప్పారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఉప తహశీల్దార్ రమేష్ బాబు, సహాయ గణాంకాధికారి రమాదేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి.జానకి, మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దారు ఈశ్వరమ్మ

వరి విత్తనాల పంపిణీ

వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-సబ్బవరం

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో వ్యవసాయ పెట్టుబడి కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు త్వరలో ఆ మొత్తం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాలు, ఎరువులు, మరుగు మందులు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు పంచకర్ల వెంకటేశ్వరరావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ శరగడం రూన్సీ లక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద, కూటమి నేతలు బలిరెడ్డి అప్పారావు, సాలాపు వెంకటేశ్వరరావు, ఇందల వెంకటరమణ, మిడతాడ మహాలక్ష్మి నాయుడు, గండి దేముడు, గండి ముత్యాల నాయుడు, ఇన్చార్జి ఎంపిడిఓ ఓ.మహేష్, విశాఖపట్నం జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలరాజు, అనకాపల్లి జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు, స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పరవాడ : మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏఒ చంద్రావతి ఆధ్వర్యంలో ప్రభుత్వం రాయితీతో సరఫరా చేసిన వరి విత్తనాలు శుక్రవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పైల సన్యాసిరావు, పైల చిన అక్కునాయుడు, పైలా బుజ్జి, వర్రి చంద్రశేఖర్, పైలా అప్పలనాయుడు, వ్యవసాయ ఏఓలు సంజీవరావు, మూర్తి, రైతులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు గ్రామ ఉప సర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు చేతుల మీదుగా శుక్రవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిన్ని దొరబాబు, కొలగాని శేషు, అడపా మహాలక్ష్మి నాయుడు, పోలి నాగేశ్వరావు, చిన్ని ధర్మరాజు, రామ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటాన్ని బహూకరించిన నాగ జగదీష్

చంద్రబాబు, భువనేశ్వరికి చిత్రపటం బహూకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి దంపతులను శుక్రవారం ఉండవల్లిలో వారి స్వగృహంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు కలుసుకొని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా చంద్రబాబు నాయుడు, భువనేశ్వరికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనకాపల్లికి చెందిన శిల్పి కామధేను ప్రసాద్ చిత్రీకరించిన ఫోటో ఫ్రేమ్‌ను చంద్రబాబు భువనేశ్వరి దంపతులకు బహూకరించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పరవాడ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడిగా ఏపీ ట్రాన్స్‌కో 220 కెవి పెందుర్తి సబ్ స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన భాను ప్రకాష్ కుటుంబ సభ్యులకు ఇంజనీర్లు, కాంట్రాక్ట్ కార్మికులు కలసి రూ.4లక్షల 50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు సూపరింటెండెంట్ ఇంజనీర్ చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి డివిజన్ ఈఈ రాజ్ కుమార్, పెందుర్తి సబ్ స్టేషన్ ఏడిఈ శ్రీనివాస్, శాస్త్రి, విద్యాసాగర్, ఇంజనీర్లు, కాంట్రాక్ట్ కార్మికుల తరపున ఏఐసిఈఏ జి3045 యూనియన్ విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎన్ఎన్ మూర్తి, డి చంద్రశేఖర్, ఎన్ చంద్రశేఖర్, లక్ష్మణ్, సంతోష్ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

మంత్రి కొండపల్లికి రత్నాకర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర చిన్న మధ్య తరహా పరిశ్రమలశాఖ, ఎస్ఇఆర్‌పి, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్‌ని తెలుగుదేశం పార్టీ విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ విజయనగరంలోని వారి నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని అందజేశారు.

2న మెగా జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జులై నెల 2వ తేదీన నిర్మాణ్ సంస్థ సౌజన్యంతో మెగా జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్‌లో టెన్త్, ఇంటర్, డిగ్రీ పాసైన విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇందులో 12 ప్రసిద్ధ కంపెనీలు పాల్గొనున్నట్టు వెల్లడించారు. దీనిని స్థానిక యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్, సీనియర్ అధ్యాపకులు హెచ్ సుధీర్‌ను 7780688683 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ కూలీలకు బకాయిలు చెల్లించాలి

సిపిఎం నాయకులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని రేగుపాలెం, పోతురెడ్డిపాలెం, రామభద్రపురం కాలనీ ఉపాధి హామీ పథకం కూలీలకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సిపిఎం నాయకులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. కూలీల పనులు చేసే ప్రదేశానికి ఆయన శుక్రవారం వెళ్లి వారితో మాట్లాడారు. 5 వారాల 5 రోజులకు వేతనం బకాయి ఉందని వారు చెప్పడంతో వాటిని ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. అంతే కాకుండా 100 రోజులు పనిపూర్తయిన వేతన కూలీలు బతకడానికి భరోసా కల్పిస్తూ పనిదినాలు 200 రోజులకు పెంచాలని, దినసరి వేతనం రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చింతకాయల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న అప్పారావు

పాల సంఘం అధ్యక్షునిగా తాతబాబు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని ఐతంపూడి పాల సంఘం అధ్యక్షునిగా అప్పాన తాతబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన తాతబాబును చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు సాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తాతబాబును అభినందిస్తున్న ఎమ్మెల్యే

ధనార్జనే ధ్యేయంగా..

-ప్రయివేటు పాఠశాలల్లో అధిక ధరలకు పుస్తకాల విక్రయాలు- ఫీజుల మోత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మండలంలోని పాఠశాలల యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా విద్యతో వ్యాపారం చేస్తున్నాయి. మండలంలో 40 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. పలు ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్టుల అమ్మకాలు చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను భేఖాతరు చేస్తూ యథేచ్ఛగా పాఠశాలల్లోనే పుస్తకాలను విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

సుమారుగా మండలంలో 15000 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజులు కంటే అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. చదువు మెరుగు పడుతుందనే ఆశతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు పెంచడంతో నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారింది. అధిక ఫీజులను నియంత్రించాల్సిన అధికారులు సైతం తమకేమి సంబంధం లేనట్లుగా వ్యవహరించడం విశేషం. అధికారులు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై దృష్టి సారించి నియంత్రించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థి సంఘాలు ఆందోళన చేసిన సందర్భాల్లో అధికారులు తనిఖీలు చేసి నామమాత్ర చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆయా ప్రైవేట్ పాఠశాలలు దందా సాగిస్తున్నాయి. నిబంధనల ప్రకారం పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ విక్రయించకూడదు. పాఠశాలల ఆవరణలోనే పాఠశాలల పేరున ముద్రించిన పాఠ్య, నోటు పుస్తకాలు విక్రయిస్తున్నాయి.



పాఠశాలల్లో విక్రయాలు తగవు

యాజమాన్యాలు తీరుమార్చుకోకపోతే విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయక తప్పదు. అధిక ఫీజులు వసూలు చేస్తూ యూనిఫామ్ పుస్తకాలు పాఠశాలలోనే విక్రయిస్తున్నారు. ఇది సరికాదు పాఠశాలల్లో ర్యాంకులు సాధించిన ఫోటోలతో బోర్డులు ప్రదర్శిస్తున్నారు తప్ప తరగతి ఫీజుల వివరాలు ఎందుకు ప్రదర్శించ లేదు. చాలా పాఠశాలల్లో స్కూల్ బస్సులు మార్చాల్సి ఉంది.



రాధాకృష్ణ
ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు

అధికంగా ఫీజులు వసూలు చేస్తే చర్యలు

ప్రైవేటు పాఠశాలలకు అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ప్లే గ్రౌండ్ ఆట స్థలం తప్పనిసరి. పాఠశాలకు సమీపంలోనే ప్లేగ్రౌండ్ ఉండాలి. సరైన మౌలిక సదుపాయాలు కల్పించక పోయినా చట్టపరమైన చర్యలు ఉంటాయి. అధిక ఫీజుల వసూలుపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే పాఠశాల అనుమతులు రద్దు చేస్తాం. ప్రైవేటు పాఠశాలల్లో పుస్తకాలు, బ్యాగులు అమ్మకాలు చేస్తున్నట్లు తమకు ఎవరైనా ఫిర్యాదు చేసినట్లయితే తక్షణ చర్యలు చేపడతాం.

సిహెచ్.తలుపులు
ఎంఇఒ

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని పలు గ్రామాల్లో పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. మండలంలో లింగంపేట సచివాలయ పరిధి తాళ్లచీడికాడ, చీడిగుమ్మల - 2 సచివాలయ పరిధిలో ఎరకంపేట, పప్పుశెట్టిపాలెం సచివాలయ పరిధిలో సుద్దలపాలెం గ్రామాల్లో శుక్రవారం వైద్య అధికారుల బృంద ఆధ్వర్యంలో శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది గ్రామాల్లో ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వర పీడితులకు అవసరమైన మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్యామ్ మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్లో జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందుకే ప్రతి ఒక్కరు కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు.వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలన్నారు. నిల్వ పదార్థాలను తినకూడదన్నారు.ఈ శిబిరాల్లో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు

ప్రజాశక్తి -గొలుగొండ: జల జీవన మిషన్ పథకంలో భాగంగా పంచాయతీలో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తామని పాత మల్లంపేట సర్పంచ్ గెడ్డం ఆదిలక్ష్మి ఆనంద్ అన్నారు. మండలంలో పాత మల్లంపేట పంచాయతీ శివారు పోలవరం గ్రామంలో శుక్రవారం జల జీవన్ మిషన్ పనుల్లో భాగంగా బోర్ వెల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బుడ్డడపాడు గ్రామంలో 12.80 లక్షలతోనూ, పోలవరంలో 4.70 లక్షలతోనూ పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గెడ్డం ఆనంద్, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని సిహెచ్ నాగాపురంలో జల జీవన్ మిషన్‌లో భాగంగా 5 లక్షల తో బోరు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గజ్జెలపు మణి కుమారి, సర్పంచ్ యలమంచిలి రఘు రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో శుక్రవారం 6 ,7 ,8 ,9 తరగతుల మిగులు సీట్లు భర్తీకై నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఎంఈఓ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు 154 మంది దరఖాస్తు చేసుకోగా 137 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. ప్రవేశ పరీక్ష ఫలితాలను రెండు రోజుల్లో వెల్లడించి అభ్యర్థులకు తెలియపరుస్తామని ఆయన తెలిపారు.

నేడు కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ : శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి (విశాఖపట్నం) సహకారంతో మండలంలో ఈనెల 29న కేడిపేట అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయం వద్ద కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. తనిఖీలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు తమ ఫౌండేషన్ ద్వారా చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంత ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపాధి హామీ కూలీల బకాయిలను వెంటనే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధి కూలీల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, 7 వారాలుగా ఉపాధి కూలీలకు పేమెంట్లు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు సకాలంలో పేమెంట్లు చెల్లించక పోతే ఎలా అని ప్రశ్నించారు. జాబ్ కార్డుకు 200 రోజుల పని దినాలు కల్పించి, రోజుకు 600 రూపాయలు కూలి చెల్లించాలని డిమాండ్ చేసారు.ఉపాధి హామీ చట్టం ప్రకారం కూలీలకు రావాల్సిన సమ్మర్ అలవెన్స్ చెల్లించాలని, ప్లే సిప్‌లు, మెడికిల్ కిట్స్ ఇవ్వాలన్నారు. కూలీలకు చెల్లించాల్సిన 7 వారాల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, మండల కమిటీ సభ్యులు గొర్ల రమణ, నాయకులు పీక్కి శ్రీను, ఏడిద నవీన్, ఎమ్.శ్రీను, గొర్ల రాము, పల్లా శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత అప్పలరాజు

పాల సొసైటీ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- నాతవరం:పాల సొసైటీ అధ్యక్షులుగా వనిమిన శ్రీనివాస్ ఏక గ్రీవంగా ఎన్నిక అయ్యారు. మండలంలో మన్యపురట్ల గ్రామంలో శుక్రవారం విశాఖ డైరీ పాల సొసైటీ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షులు గా వనిమిన శ్రీనివాస్‌చ డైరెక్టర్‌గా కూనిశెట్టి వరహాలరావుతో పాటు మరో ఏడుగురు డైరెక్టర్లు ఏక గ్రీవంగా ఎన్నిక అయ్యారు. నాతవరం ఎస్ఐ రామారావు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పరివేక్షణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాల ఉత్పత్తి దారులు, గ్రామ పెద్దలు వనిమిన చిన సూర్యారావు, వీసం నూకరాజు, పుణ్యమంతుల బాబ్జి పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

104 వైద్య సేవలు

పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని ఎం కోటపాడు వల్లాపురంలో 104 వైద్య సిబ్బంది ఉచిత సేవలు అందించింది. శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు గ్రామంలో రామ కోవెల వద్ద కమ్యూనిటీ భవనంలో 104 వైద్య సేవ బృందం వైద్య సేవలు అందించినట్లు కేజే పురం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా ప్రసాద్ తెలిపారు. 82 మంది పేషెంట్లను తనిఖీ చేసి మందుల అందించినట్లు తెలిపారు. వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోగులకు ఉచిత మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి రుక్మిణి స్వాతి, ఏఎన్ఎం ఎం.పుష్ప, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పత్రాలను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఆర్‌డిఒ ఆదేశాలతో..

కుల ధ్రువీకరణ పత్రాల జారీకి చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల:రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ తీసుకొని వారికి కుల ధృవీకరణ పత్రాలు సుమోటోగా అందజేసేందుకు ఆన్లైన్లో ఎన్నికల ప్రక్రియ ముందు పొందుపరిచిన వివరాల మేరకు వారి వివరాల సేకరణ కోసం గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామాల బాట పట్టారు. మండల రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆర్డీవో ఆదేశాలతో పెండింగ్‌లో ఉన్న సుమారు 4900 దరఖాస్తులను త్వరితగతిన గ్రామాల్లో పరిశీలించాలని సూచించారు. ఈ మేరకు గ్రామాలలో అధికారులు పర్యటించారు. శుక్రవారం పలు గ్రామాలలో సక్రమంగా నెట్వర్క్ లేక పోవడంతో అరకొరగానే ఆన్లైన్ ప్రక్రియ జరిగింది. దీంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పప్పు శెట్టిపాలెం పంచాయతీ శివారు నర్సింగబిల్లి గ్రామంలోని రామకోవెల ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. రామాలయం మూడవ వార్షికోత్సవ సందర్భంగా కల్యాణాన్ని చేపట్టారు. అనంతరం భారీ అన్న సమారాదన నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత గోవిందరావు

బిఎన్ రోడ్డులో గోతులు పూడ్చాలి: సిపిఎం

ప్రజాశక్తి -కొత్తకోట: బిఎన్ రోడ్డుకు తక్షణమే మరమ్మత్తు చేపట్టాలని, లేదంటే అదే రోడ్డులో జల దీక్ష చేస్తామని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందరావు హెచ్చరించారు. కొత్తకోటలో శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, చోడవరం నియోజకవర్గ పరిధిలో బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలు కలుపుకుంటూ నర్సీపట్నం ప్రయాణించే బి.ఎన్ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు పడి చెరువులను తలపిస్తున్నాయన్నారు. రాత్రివేళలో బైకులపై వెళ్లేవారు గోతులలో పడి పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గర్భిణీలు ఆర్టీసీ బస్సులో ఈ రహదారి గుండా ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్అండ్‌బి అధికారులు పట్టించుకోలేదని విమర్శించారు. నూతనంగా ప్రభుత్వం ఈ రహదారిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.రోలుగుంట, రావికమతం మండలాల్లో గ్రానైట్, నల్ల రాయి క్వారీలతో 60 టన్నుల భారీ వాహనాలు తిరగడంతో రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమవుతున్నాయని, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వర్షాకాలంలో బ్రిడ్జిలు కూడా కూలి పోయే ప్రమాద పరిస్థితిలో ఉన్నాయన్నారు.

1న పింఛన్ల పంపిణీ చేపట్టాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పథకం అమల్లో భాగంగా జూలై 1వ తేదీన లబ్ధిదారులు అందరికీ ఇంటి వద్ద పెన్షన్ అందజేయాలని ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో సీతారామరాజు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగులు 1వ తేదీనే పెన్షన్ లబ్ధిదారుల అందరికీ పెన్షన్ నగదు అందజేసి, 100 శాతం పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కింద కూర్చుని చదువుతున్న విద్యార్థులు

చెట్ల కిందే విద్యా బోధన

- పునాది దశలోనే పాఠశాల భవనం - అవస్థలు పడుతున్న చెరుకుపల్లి విద్యార్థులు

ప్రజాశక్తి-చీడికాడ:గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా మారుస్తామని ప్రకటనలు ఇస్తూ కోట్లాది రూపాయల నిధులు వెచ్చించారు. దీంతో, పాఠశాలలు లేని చోట పాఠశాలలు నిర్మిస్తారని అందరూ భావించారు. మారుమూల ప్రాంతాల్లో పాఠశాలలు లేని చోట వీటి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వలేదు. చీడికాడ మండలంలోని కోనాం పంచాయతీ శివారు చెరుకుపల్లి గిరిజన గ్రామంలో సుమారు 26 మంది గిరిజన విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆ గ్రామంలో పాఠశాల భవనం లేక పోవడంతో గ్రామస్తులు శ్రమదానంతో నిర్మించిన పూరిపాకలో విద్యాభ్యాసం కొనసాగేది. గత ప్రభుత్వ హయంలో నాడు నేడు పథకం ద్వారా పాఠశాల భవనం మంజూరు చేశారు. అది మొదటి విడతలో కాకుండా రెండో విడతలో 2023లో మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. మారుమూల గిరిజన ప్రదేశం కావడంతో పాటు నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో మరుగుదొడ్లు, వంటశాల స్లాబ్ లెవెల్‌కు చేరగా పాఠశాల భవనం పునాదులకే పరిమితమైంది. ఏడాది గడిచినా పాఠశాల భవనం పూర్తి కాక పోవడంతో గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పూరి గుడిసెలో విద్యా బోధన కొనసాగిస్తున్నారు. ఇటీవల కాలంలో గాలి వానకు ఆ పూరి గుడిసె కాస్త శిధిలావస్థకు చేరింది. దీంతో, విద్యా బోధన చేసేందుకు ఆటంకం కలగడంతో ఉపాధ్యాయుడు మామిడి చెట్టు కింద విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణం వేగవంతం చేయాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈ విషయమై ఉపాధ్యాయుడు వరాహమూర్తిని వివరణ కోరగా.. నిధులు విడుదల కాక పోవడంతో భవనం పూర్తి కాలేదన్నారు. గ్రామస్తులు వేసిన పాక శిథిలం కావడంతో విద్యా బోధన చెట్టు కిందకు మార్చాల్సి వచ్చిందన్నారు.వర్షం పడితే విద్యాబోధన చేయడం కష్టంగా ఉందని తెలిపారు.

ఈ విషయమై మండల విద్యాశాఖ అధికారి బొంజు బాబును వివరణ కోరగా నాడు నేడు ద్వారా రెండో విడతలో భవనం మంజూరు కాగా, నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో నిర్మాణం పూర్తి కాలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు.

పునాది దశలో నిలిచిన పాఠశాల

పివికి ఘన నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం మాజీ ప్రధాని పివి స్మారకార్థం అవార్డును ప్రవేశపెట్టాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ కోరారు. శుక్రవారం పివి.నరసింహారావు జయంతి సందర్భంగా సర్క్యూట్ హౌస్ ఎదురుగా ఉన్న పివి.నరసింహారావు విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం రామ్ మీడియాతో మాట్లాడారు. దక్షిణ భారతదేశం నుంచి ప్రధానమంత్రి పీఠాన్ని అధిష్టించిన మొట్టమొదటి వ్యక్తి పివి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో కొయ్య రామకృష్ణ యాదవ్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

పల్లాను కలిసిన దొన్నుదొర

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:టిడిపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా నియమితులైన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ను శుక్రవారం ఆ పార్టీ అరకు నియోజకవర్గ ఇంచార్జ్ సివేరి దొన్నుదొర, పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, మాజీ సర్పంచ్ మహదేవ్, ఉప సర్పంచ్ పాడి చందు నాగరాజు, వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా రక్షణ కమిటీలు ఏర్పాటు చేయండి

-సబ్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి

ప్రజాశక్తి - పాడేరు: మహిళలు పనిచేసే ప్రదేశాలలో ఎటువంటి లైంగిక వేదింపులకు గురి కాకుండా అరికట్టే దిశగా మహిళల రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ కలెక్టర్ పి. ధాత్రి రెడ్డి అన్నారు. ఐటిడి ఏ సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమావేశ మయ్యారు. పది మంది ఉద్యోగులు ఉన్న ప్రతీ ప్రభుత్వ కార్యాలయాల్లో ముగ్గురు సభ్యులతో కూడిన అంతర్గత కమిటీలు ఏర్పాటు చేసి నివేదికలు సమర్పించాలన్నారు. అన్ని మండల కార్యాలయాలలోను కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 14, 15 హెచ్ ప్రకారం గౌరవంగా జీవించే హక్కు, ఏదైనా వృత్తిని అభ్యసించే హక్కు, లైంగిక వేదింపులకు గురికాకుండా సురక్షితమై వాతావరణం కలిగి ఉండే హక్కులను పొంది ఉన్నారన్నారు. మహిళలు స్వేచ్ఛగా భద్రత కలిగి ఏదైనా వృత్తి, వ్యాపారం నిర్వహించడానికి అవసరమైన వాతావరణ కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఏస్ సంచాలకులు సూర్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ